# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :131 | ప్రచురణ : హైదరాబాద్ | మంగళవారం,24-03-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## హైదరాబాద్ సిటీ చుట్టూ 4 ఎలివేటెడ్ కారిడార్స్

హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్

భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని వెల్లడి

30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం





హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ రద్దీతోపాటు సిటీ నుంచి బయటకు వెళ్లాలంటే ప్రయాణికులకు ట్రాఫిక్ రద్దీ తప్పటం లేదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. 2026, మార్చి 23వ తేదీన శాసన మండలిలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ సమస్యలు.. రాబోయే ప్రాజెక్టులకు సంబంధించి కీలకమైన విషయాలు వెల్లడించారు.సిటీ నుంచి సిటీ బయటకు వెళ్లాలంటే చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందని.. దీనికితోడు ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదన్నారు. భవిష్యత్ లో పెరగనున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని.. సిటీ వెలుపల అభివృద్ధికి అద్భుతమైన ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారాయన.సిటీ చుట్టూ నాలుగు ఎలివేటెడ్ కారికార్ల నిర్మాణానికి ప్రణాళిక రెడీ చేసినట్లు వివరించారు సీఎం. గౌలిగూడ జంక్షన్ దగ్గర ఒకటి.. చాదర్ ఘాట్ జంక్షన్ లో మరొక ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టన్నట్లు ప్రకటించారాయన.

అదే విధంగా నాగోలు దగ్గర ఒకటి.. అంబర్ పేట జంక్షన్ దగ్గర మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో.. సిటీ నుంచి నేరుగా సిటీ బయటకు.. ఈజీగా వెళ్లొచ్చన్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి భూసేకరణ చాలా చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం వల్ల ట్రాఫిక్ ఫ్రీ అవుతుందని.. సిగ్నల్స్ లేకుండా సిటీ బయటకు ఈజీగా వెళ్లిపోవచ్చన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

హైదరాబాద్ సిటీకి నలువైపులా.. నాలుగు చోట్ల ఈ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో సిటీలోనూ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని.. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు వరకు సిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

## అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం

ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు..

దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!

- సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అడ్వైజర్ గా ఎలా నియమించుకుంటారని హరీశ్ ప్రశ్న
- ఎగుమతులు 22,750 టన్నుల వద్దే ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్న
- హరీశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- బియ్యం ఎగుమతుల్లో ప్రేమ్ చంద్ కు సంబంధం లేదని వ్యాఖ్య



రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు.

ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు.

హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## దేశంలోనే తొలి ప్రయోగం.. బేగంపేట రన్‌వే కింద మల్టీ-లేన్ అండర్‌పాస్



హైదరాబాద్ నగరంలో, ముఖ్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ఏళ్లుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద వాహనాల రాకపోకల కోసం మల్టీ-లేన్ అండర్‌పాస్ నిర్మాణానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూ×) నుంచి అనుమతులు సాధించినట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు.సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. సుచిత్ర జంక్షన్ నుంచి ప్యారడైజ్ సర్కిల్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా ఈ అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడమే కాకుండా, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ వంటి ఉత్తర జిల్లాల నుంచి నగరంలోకి వచ్చే వాహనదారులకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "యాక్టివ్‌గా ఉన్న ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద అండర్‌పాస్ నిర్మించడం దేశంలోనే ఇది తొలిసారి. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి నిర్మాణం లేదు. దీనికోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులు సాధించాం. పనులు కూడా ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి," అని వివరించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ఆయన అన్నారు.

'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా హైదరాబాద్ నగరాన్ని ఢిల్లీ, ముంబైల వలె తీవ్రమైన ట్రాఫిక్, కాలుష్య సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లతో నగరంలో మౌలిక వసతులను పటిష్టం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రి పదవిపై మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు సీఎం అవుతాడని వ్యాఖ్య

కేసీఆర్, రామచందర్ రావులకు అలా చెప్పే దమ్ముందా అని నిలదీత


బీజేపీ నాయకులు బీసీలకు వ్యతిరేకులు అని విమర్శ

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి పదవి అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతాడని జోస్యం చెప్పారు. తమ పార్టీల నుంచి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావులకు చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు.బీజేపీ నాయకులు బీసీ వ్యతిరేకులు అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం డిక్లరేషన్ ప్రకటించి చట్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం అందరికీ సన్నబియ్యం ఇస్తోందని, ఇది చారిత్రాత్మకమని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బియ్యం దోపిడీ జరిగిందని ఆరోపించారు.



## ఎమ్మెల్యే దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు






ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన వ్యవహారంపై స్పీకర్ తీర్పును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్ ను ఇవాళ హైకోర్టు విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి లోక్ సభ ఎన్నికల్లో దానం పోటీ చేశారని మహేశ్వర్ రెడ్డి న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కర్ణాటక, బీహార్ రాష్ట్రాల్లో ఇలాంటి పిటిషన్ ల పై సుప్రీం కోర్టు తీర్పులను ప్రస్తావించారు. స్పీకర్ తరపున వాదించేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. అయితే ఏజీ గా ఉండి స్పీకర్ తరుపున ఎలా వాదిస్తారని ప్రశ్నించింది కోర్టు. సీనియర్ న్యాయవాదిగా హాజరవుతున్నానని చెప్పారు సుదర్శన్ రెడ్డి. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్ తో పాటు, అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు ఇచ్చింది హై కోర్టు. తదుపరి విచారణను ఏప్రిల్ 16 కు వాయిదా వేసిందిహైకోర్టు.దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని ఇటీవలే స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. అలాగే బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను సుప్రీం కోర్టు డిస్పోజ్ చేసింది. ఈ పిటిషన్లపై విచారణ ముగించినట్లు సుప్రీం కోర్టు ధర్మాసనం ప్రకటించింది.

## అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క



- మూడు డీఏ బకాయిలను త్వరలోనే క్లియర్ చేస్తామన్న మల్లు భట్టి
- గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని విమర్శ
- ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు విడుదల చేస్తున్నామని వెల్లడి


తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఏ బకాయిల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలను మానవతా కోణంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని,

వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.

# గచ్చిబౌలి, రాయదుర్గంలలో భారీగా పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, మార్చి23,**
హైదరాబాద్ నగరంలో ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. గత ఫిబ్రవరి నెలలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు 32 శాతం మేర పెరిగాయి. అధిక విలువ కలిగిన ఇళ్లకు అధికంగా డిమాండ్ ఉన్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. గౌచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి ప్రాంతాల్లో అధిక విలువ ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఒక్క ఫ్లాట్ రూ.8.90 కోట్లు పలికినట్లు తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో సొంతిల్లు కొనుగోలు చేయాలనుకుంటున్న వారి సంఖ్యా పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 5988 ట్రాన్సాక్షన్లు జరిగితే ఈ ఏడాది 2026 6179కి పెరిగాయి. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపాదికన చూసుకుంటే రెండు శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది 2026, జనవరి నెలలో 4686 యూనిట్లతో పోలిస్తే ఫిబ్రవరి నెల రిజిస్ట్రేషన్లు 32 శాతం పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఇళ్ల ట్రాన్సాక్షన్లు ప్రైమరీ, సెకండరీ మార్కెట్లో జరుగుతుంటాయి. కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల్లో నేరుగా బిల్డర్ నుంచి కొనే మార్కెట్‌ను ప్రైమరీగా పరిగణిస్తారు. ఈ నివాసాలను తిరిగి అమ్మితే ఒక యజమాని నుంచి మరొక వ్యక్తి కొనుగోలు చేస్తారు. దీన్ని సెకండరీ మార్కెట్ గా గుర్తిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతో పాటుగా సంగారెడ్డి జిల్లాలోని కొంత భాగం కూడాహైదరాబాద్ రియల్ ఎస్టేటే పరిధిలోకి వస్తుంది. ఫిబ్రవరి నెలలో మొత్తం 28 రోజులో అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు నివేదిక పేర్కొంది.రిజిస్ట్రేషన్ ట్రాన్సాక్షన్లలో కోటి రూపాయలు అంత కంటే ఎక్కువ విలువైన ఇళ్ల వాటా 18 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 6



శాతం పెరిగాయి. సగటు చదరపు అడుగు విలువ ఏడాది కాలంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 6 శాతం, సంగారెడ్డి జిల్లాలో 7 శాతం మేర ధరలు పెరిగాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల సగటు చదరపు అడుగు రూ.4457 గా ఉంది. ఫిబ్రవరి నెలలో రూ.4139 కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగితే వాటిలో కోటి రూపాయలపై విలువ కలిగిన ఇళ్ల విలువే 48 శాతంగా ఉందిఅధిక విలువ ఉన్న నివాస లావాదేవీలు ఐటీ కేంద్రంగానే అధికంగా జరిగాయి. అత్యధికంగా 3 వేల చదరపు అడుగుల కంటే అధిక వైశాల్యం కలిగినవి ఉన్నాయి. విలువ పరంగా మొదటి నాలుగు ట్రాన్సాన్లు గమనిస్తే నార్సింగిలో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ విలువ రూ.8.90 కోట్లు నమోదైంది. ఆ తర్వాత గచ్చిబౌలిలో రూ.7.93 కోట్లు, రాయదుర్గంలో రూ.6.54 కోట్లు, షేక్ పేట్‌లో రూ.6.34 కోట్లతో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ జరిగింది.

నెలల వారీగా చూసుకుంటే హైదరాబాద్ నగరంలో జనవరిలో 2025లో 5464 రిజిస్ట్రేషన్లు జరగగా 2026లో 4686 ఇళ్లు అమ్ముడయ్యాయి.

ఇక ఫిబ్రవరి నెలలో 2025లో 5988 యూనిట్లు రిజిస్టర్ కాగా అది ఫిబ్రవరి నెలలో 6179గా నమోదైందివిస్తీర్ణం పరంగా చూసుకుంటే 500 చదరపు అడుగు లోపు ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు 3 శాతం పెరిగాయి, 501-1000 చ.అ.లోపు ఇళ్లు 15 శాతం, 1001-2000లోపు ఇళ్లు 66 శాతం, 2001-3000 చ.అ.లోపు ఇళ్లు 13 శాతం, 3000 పైన ఇళ్లకు 3 శాతం రిజిస్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్
నెలలో 14 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 45 శాతం, రంగారెడ్డిలో 41 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

# అసెంబ్లీలో వార్ వన్ సైడ్...

**హైదరాబాద్, మార్చి23, :**
తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం అసెంబ్లీ వేదికగా శరవేగంగా మారుతోంది. గత పదేళ్లుగా సభను శాసించిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో అధికార పక్షం సంధిస్తున్న విమర్శలకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అగ్రెసివ్ స్ట్రాటజీ, ప్రతిపక్షనేత కేసీఆర్ సభకు గైర్హాజరు కావడం.. ఈ రెండు అంశాలు సభలో చర్చను వార్ వన్ సైడ్ మారుస్తున్నాయిప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర అత్యంత కీలకం. కానీ, కీలకమైన బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ దూరంగా ఉండటం అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ, సభను తన వాక్చాతుర్యంతో, చారిత్రక ఆధారాలతో అదుపులోకి తెచ్చుకునే కేసీఆర్ మార్క్ వ్యూహం ఇక్కడ కొరవడింది. ప్రజలు ఎన్నుకున్నా సభకు రావడం లేదనే అంశాన్ని రేవంత్ రెడ్డి ఒక అస్త్రంగా మార్చుకున్నారు. ప్రజాధనం జీతంగా తీసుకుంటూ సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యం అనే విమర్శను కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో సఫలీకృతం అవుతున్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ఉపయోగించిన సాక్ష్యాధారాల వ్యూహాన్నే ఇప్పుడు రేవంత్ తిరిగి వారిపైనే ప్రయోగిస్తున్నారు. బీఆర్ఎస్ ఏదైనా ప్రజా సమస్యను లేవనెత్తినప్పుడు, రేవంత్ రెడ్డి వెంటనే గత పదేళ్లలో జరిగిన వైఫల్యాలను, శ్వేతపత్రాలను బయటపెడుతున్నారు. దీంతో చర్చ ప్రస్తుత సమస్యల నుంచి మళ్ళీ పాత ప్రభుత్వ తప్పుల వైపు మళ్లుతోంది. కేటీఆర్ వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి అంతే దీటుగా, తనదైన శైలిలో తెలంగాణ యాసతో విరుచుకుపడుతున్నారు. ఇది సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఉత్సాహాన్ని నింపుతుండగా, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది.సభలో బీఆర్ఎస్ గళాన్ని కేటీఆర్, హరీష్ రావు వినిపిస్తున్నప్పటికీ, వారి మధ్య సమన్వయం కంటే డిఫెన్స్ కే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఆరు గ్యారెంటీలపై కేటీఆర్ చేసే కొన్ని సవాళ్లు, ప్రభుత్వం వద్ద ఉన్న పాత ఫైళ్ల వల్ల తిరిగి పార్టీకే ఇబ్బందిగా మారుతున్నాయి. హరీష్ రావు గణాంకాలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నా, మంత్రులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయనను అడ్డుకుంటున్నారు.బీఆర్ఎస్ మళ్ళీ సభలో పట్టు సాధించాలంటే కేసీఆర్ రాక తప్పనిసరి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధినేత సభలో ఉంటే ఎమ్మెల్యేల్లో ఉండే



ధైర్యం వేరు. ప్రస్తుతం సభలో అజెండాను ప్రభుత్వం సెట్ చేస్తోంది. దాన్ని ప్రతిపక్షం వైపు తిప్పుకోవాలంటే కేసీఆర్ అనుభవం, విషయ పరిజ్ఞానం అత్యవసరం. ప్రస్తుతానికి తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి హవా స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ యుద్ధంలో గెలవాలంటే సైన్యం మాత్రమే సరిపోదు, సేనాని కూడా రంగంలో ఉండాలి. కేసీఆర్ సభకు వస్తే తప్ప ఈ వన్ సైడ్ వార్ రసవత్తరమైన ద్వైపాక్షిక పోరుగా మారే అవకాశం లేదు.
రేవంత్ పంచ్ లు కేసీఆర్ కు అసెంబ్లీకి రాకున్నా ఇస్తున్న జీతం కోటి.. రాక మాత్రం అంటిముట్టనట్టు" అంటూ రేవంత్ రెడ్డి సంధిస్తున్న బాణాలు గులాబీ క్యాడర్‌కు గుచ్చుకుంటున్నాయి. "ప్రజాధనం తీసుకుంటూ.. ప్రజల గొంతుక వినిపించరా?" అంటూ రేవంత్ వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ తమ్ముళ్లు నీళ్లు నములుతున్నారు. కేసీఆర్ ఉండి ఉంటే తనదైన శైలిలో 'ఏం తమ్మి.. ఏం మాట్లాడుతున్నావ్?' అని కౌంటర్ ఇచ్చేవారేమో కానీ, ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది.కేటీఆర్ అస్త్రంగా ఆరు గ్యారెంటీలు ఏవి? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటుంటే.. రేవంత్ మీ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలు ఏవి? ఆ ప్రాజెక్టుల అంచనాలు ఏమయ్యాయి? అంటూ నిలదీస్తున్నారు. చర్చ ప్రజా సమస్యల మీద జరగాల్సింది పోయి, "నువ్వు ఎక్కువ తిన్నావా.. నేను ఎక్కువ తిన్నానా?" అన్న చందంగా పాత రికార్డుల దుమ్ము దులిపే కార్యక్రమంగా మారిపోయింది. కేసీఆర్ మార్క్ వ్యూహచతురత లేకపోవడంతో రేవంత్ దూకుడు ముందు కేటీఆర్ వ్యూహాలు "తేలిపోయిన అప్పడాల్లా" మారుతున్నాయని విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఏకపక్షంగా సాగిస్తున్న ఈ 'వన్ సైడ్ వార్' ఆపాలంటే, గజ్వేల్ సింహం గర్జించాల్సిందే అని పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. "సార్.. మీరు రండి సార్.. లేకపోతే రేవంత్ అన్న మాకు చుక్కలు చూపిస్తున్నాడు" అని లోలోపల మదనపడుతున్నారు.మొత్తానికి కేసీఆర్ రాకపోయేసరికి అసెంబ్లీలో బీఆర్ఎస్ పరిస్థితి "కెప్టెన్ లేని టీమ్ ఇండియా"లా తయారైంది. మరి కేసీఆర్ ఎప్పుడు ఎంట్రీ ఇస్తారు? రేవంత్ స్పీడ్‌కు ఎప్పుడు బ్రేక్ వేస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

# 21 మీటర్లు దాటితే హై-రైజ్ భవనాలు

**హైదరాబాద్, మార్చి23, :**
తెలంగాణ ప్రభుత్వం బిల్డింగ్ రూల్స్‌లో కీలక సవరణలు చేసింది. ఇకపై 21 మీటర్ల పైబడిన వాటినే హై-రైజ్ భవనాలుగా గుర్తిస్తారు. భారీ నిర్మాణాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూనే, రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి వెసులుబాటు కల్పించింది. సెట్‌బ్యాక్ నిబంధనలలో 10 శాతం సడలింపునిచ్చింది. పట్టణాల్లో వర్టికల్ గ్రోత్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించింది.తెలంగాణలో శరవేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, భవన నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగానికి నూతన జవజీవాలు పోస్తూ.. నిర్మాణ నిబంధనలలో కీలక మార్పులు చేస్తూ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీవో 95ను విడుదల చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ ఉత్తర్వులు.. ముఖ్యంగా హై-రైజ్ భవనాలు, టీడీఆర్ వినియోగం, అదనపు అంతస్తుల అనుమతులపై స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించాయి.ప్రభుత్వం తాజా సవరణల ప్రకారం.. భవనాల ఎత్తు విషయంలో స్పష్టతనిచ్చింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నిర్మాణాలను మాత్రమే 'హై-రైజ్' భవనాలుగా పరిగణిస్తారు. అయితే, సాంకేతిక అవసరాల

కోసం నిర్మించే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు. ఇది నిర్మాణదారులకు సాంకేతిక పరంగా కొంత ఉపశమనం కలిగించనుంది. బదిలీ చేయగల అభివృద్ధి హక్కుల వినియోగాన్ని ప్రభుత్వం మరింత తప్పనిసరి చేసింది. 750 నుండి 2000 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 18 నుండి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలు చేపట్టాలంటే టీడీఆర్ వాడటం నిబంధనగా మార్చారు.10 అంతస్తులకు మించిన భవనాల్లో 10వ అంతస్తు పైబడిన విస్తీర్ణంపై 3 శాతం, అలాగే 20 అంతస్తులు దాటిన భవనాల్లో 20వ అంతస్తు పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి. నిర్మాణ అనుమతి సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి, మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికేట్
వచ్చే లోపు అందజేయాల్సి ఉంటుంది. నగరాల్లో స్థల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో 'వర్టికల్ గ్రోత్'ను ప్రోత్సహించేందుకు రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులకు అనుమతినిచ్చారు.2000 చ.మీ కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 40 అడుగుల రోడ్డు ఉంటే 3 అదనపు అంతస్తులు, 60 అడుగుల రోడ్డు ఉంటే 4 అదనపు అంతస్తులు, 80 అడుగుల రోడ్డు ఉంటే 5 అదనపు అంతస్తుల వరకు నిర్మించుకోవచ్చు.
భవనాల చుట్టూ వదిలే సెట్‌బ్యాక్ నిబంధనలలో టీడీఆర్ వినియోగం ద్వారా 10 శాతం వరకు సడలింపు పొందే అవకాశం కల్పించారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను మాత్రం కచ్చితంగా పాటించాలి. మాస్టర్ ప్లాన్ రోడ్ల మార్పులు జరిగినప్పుడు కన్వర్షన్ ఛార్జీలు చెల్లించి, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కూడా కల్పించారు.

## మచిలీపట్నం జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్...

### కోర్టు ప్రాంగణాన్ని జల్లేడ పట్టిన పోలీసు బృందాలు

**హైదరాబాద్, మార్చి23, :** కోర్టులో బాంబు పెట్టినట్లు అగంతకులు జిల్లా న్యాయమూర్తికి మెయిల్ చేసారు. న్యాయమూర్తి .పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషమం తెలిసి న్యాయమూర్తులు, న్యాయవాదులు కోర్టు నుండి బయటకు వచ్చారు. కోర్టు వద్దకు చేరుకున్న పోలీస్, డాగ్ స్క్వాడ్ బృందాలు, కోర్టు ప్రాంగణాన్ని జల్లేడ పట్టారు. బాంబు బెదిరింపుతో పోలీసులు కోర్టు లోకి ఎవరిని అనుమతించలేదు.

### పంట నష్టపోయిన ప్రతి ఒక్కరైతును ఆదుకుంటాం...

### ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తాం

**ఆత్మకూరు: మార్చి23, :** నంతసాగరం మండలంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించారు.. గుడిగుంట గ్రామంలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన వరి పంటను రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు.. చేతికి వచ్చిన పంట వడగండ్ల వానకు పూర్తిగా నష్టపోయామని, తమను మీరే ఆదుకోవాలంటూ మంత్రి ఎదుట తమ గోడు వెళ్ళబోసుకున్న అన్నదాతలు... ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని రైతులను ఓదార్చిన మంత్రి ఆనం, రెండురోజుల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదిక పంపించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింద అన్నారు. ఉ వడగండ్ల వానకు అనంతసాగరం, మర్రిపాడు, రాపూరు, కలువాయి మండలాల్లో సుమారు 1200 హెక్టార్లలో వరి, పత్తి, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి... ఎక్కువగా వరి పంటకు నష్టం వాటిల్లి సుమారు 1000 మందికి పైగా రైతులు నష్టపోయార అన్నారు ఉ ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడుతో పంట నష్టం పై చర్చించాం... వారు రైతులను ఆదుకునేందుకు సానుకూలంగా స్పందించార అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడొద్దు... మీ కష్టానికి తప్పకుండా న్యాయం చేస్తాం... త్వరలోనే నష్టపరిహారాన్ని అందిస్తామని అన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి బీజేపీ ప్రయత్నం.. నెలకొన్న ఉద్రిక్తత

**హైదరాబాద్: మార్చి23, :** రాష్ట్ర బడ్జెట్పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం నాడు బీజేపీ అసెంబ్లీ ముట్టడికి యత్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బడ్జెట్పై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. కీలక నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తూ, భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ

**జయశంకర్ భూపాలపల్లి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, ల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం అంబేద్కర్ కూడలిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో 136 బీసీ కులాలు ఉండగా, సుమారు 65% జనాభా ఉన్న బీసీల కోసం కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. బీసీల జనాభా శాతాన్ని అనుసరించి కనీసం 51% బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఆరోగ్య శాఖకు 4.1%, విద్యా శాఖకు 8.1% మాత్రమే కేటాయించడం దురదృష్టకరమని, ఈ రెండు రంగాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను, ప్రస్తుతం లక్షల కోట్ల అప్పులతో నడిపిస్తూ వడ్డీల రూపంలో భారీ భారం మోపుతున్నారని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు చెల్లించడానికే పెద్ద మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా, కేవలం లెక్కల పరంగా మాత్రమే చూపిస్తూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదని, 16 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురు మాత్రమే బీసీ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. అదే సమయంలో తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం అన్యాయమని అన్నారు. తెలంగాణలో సంపద సృష్టించేది బీసీలేనని, కానీ అధికారంలో మాత్రం వారికి తగిన భాగస్వామ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. 2028లో టిఆర్పి పార్టీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, సత్వర న్యాయం ప్రధాన అజెండాగా తీసుకుని, ప్రతి వర్గానికి వారి హక్కు మేర బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. అలాగే బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని, ప్రతి సంవత్సరం కనీసం రూ. 20,000 కోట్లు బీసీల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, రేగొండ మండల మహిళా అధ్యక్షురాలు అనిత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి సునీల్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా కోఆర్డినేటర్ మామిడి శ్రీకాంత్, జిల్లా కోశాధికారి జిలకర శ్రీను, సోషల్ మీడియా ఇంచార్జ్ శ్రీకాంత్, జిల్లా నాయకులు మడే సంతోష్, ఇనుగాల ప్రణీత్, లక్ష్మణ్ అల్లం రామ్ చరణ్ కృష్ణ మనోహర్ రావు, మేనం సంతోష్, మడే సతీష్, భువనగిరి రాజేష్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మినీ సరస్ ఫెయిర్ 2026 సందర్భంగా భరోసా కేంద్రం అవగాహన స్టాల్ ప్రారంభం

**మహబూబ్ నగర్: :** పట్టణంలోని శిల్పారామంలో డి.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ సరస్ ఫెయిర్లో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేనేత, హస్తకళ మరియు ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఫెయిర్కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, మహబూబ్నగర్ జిల్లా పోలీసుల తరపున మహిళలు మరియు బాలబాలికల భద్రత కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసారు. ఈ స్టాల్ను మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత ప్రారంభించారుఏ. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలు మరియు లాభాలను ప్రజలకు వివరించారు: మహిళలు, బాలబాలికలపై జరిగే హింస, వేధింపులు, దౌర్జన్యాలకు గురైన బాధితులకు సురక్షిత వాతావరణంలో సహాయం కౌన్సిలింగ్ సేవలు ద్వారా మానసిక ధైర్యం కల్పించడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం మరియు కేసులపై మార్గదర్శకం, మెడికల్ సపోర్ట్ మరియు ఇతర అత్యవసర సేవలు, బాధితులకు సంబంధించిన ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, సంబంధిత విభాగాలతో సమన్వయం చేయడం, కుటుంబ వివాదాల పరిష్కారం కోసం సమాధానపూర్వక చర్చలు, భరోసా కేంద్రం సభ్యులు స్టాల్ను సందర్శిస్తున్న ప్రజలకు ఈ సేవలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# టేక్మాల్ లో ఆశ వర్కర్ల రాస్తారోకో




**న్యూస్ ఇండియా (టేక్మాల్ రిపోర్టర్ జైపాల్ మార్చి23)** ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశ వర్కర్లు నిరసనలు, ధర్నా చేపట్టారు. ప్రధాన డిమాండ్: ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం (స్థిర వేతనం) అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

నిరసనలు: మెదక్ జిల్లాలో టేక్మాల్ మండల కేంద్రంలో ధర్నా రాసారోకోలు నిర్వహించారు. అలాగే సంగారెడ్డిలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంటి పరిసరాల్లో కూడా ఆందోళన చేపట్టారు.

ఎన్నికల హామీ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.18 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు: తక్కువ వేతనంతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందన: మంత్రి పీఏ హామీతో సంగారెడ్డిలో నిరసన విరమించారు.

ఈ నిరసనలు కేవలం ఉమ్మడి మెదక్‌లోనే కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా (ములుగు, ఆదిలాబాద్, నాగర్ కర్నూల్, మహబూబాబాద్) మంత్రుల ఇళ్ల ముట్టడి, కలెక్టరేట్ల ఎదుట వంటావార్పు చేస్తామని టేక్మాల్ మండల కేంద్రంలో ఆశ వర్కర్ల ధర్నా వలన కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో టేక్మాల్ మండలంలోని ఆశ వర్కర్లు పాల్గొని ధర్నా నిర్వహించారు.

# మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన సర్పంచ్ శాంతి కిషన్ నాయక్



**న్యూస్ ఇండియా తెలుగు మార్చి 23. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:**...మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మెగా హెల్త్ క్యాంప్ ను బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.గర్భిణీకి సంబంధించిన పరీక్షలు,అలాగే రక్త పోటు,షుగర్ పరీక్షలు,క్షయ పరీక్షలు లాంటి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం పిహెచ్ సి డాక్టర్ విజయ్ కుమార్,

ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా రంజిత్, ఫార్మాసిస్ట్ రామనర్సయ్య, జయరామ్, గుగులోత్ కిషన్ నాయక్,నాయిని శ్రీనివాస్ రెడ్డి,మండా రేణుక,ఆకునూరు సూర్యానారాయణ, కంకటి నారాయణ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ పార్లమెంటు సభ్యులు రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన

- ఎమ్మెల్యే పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, మార్చి 23: (న్యూస్ ఇండియా ప్రతినిధి కే. వినోద్ కుమార్)**
చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ జి. రంజిత్ రెడ్డి మాతృమూర్తి జి. చంద్రకళమ్మ మృతి చెందిన విషయం తెలియగానే జూబ్లీహిల్స్ లోని వారి నివాసానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు ఉప్పలపాటి శ్రీకాంత్ సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి గంధం రాములు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తో కలిసి వెళ్లి ఆమె పార్థీవ దేహానికి పూలమాల వేసి , ఘన నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన పిఎసి చైర్మన్

ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రకళమ్మ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పీఏసీ చైర్మన్ . చంద్రకళమ్మ మృతి చెందడం చాలా బాధకరమైన విషయం అని, ఆమె మరణం తీరని లోటు అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను అని ,వారికి సద్గతి ప్రాప్తించాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనసారా ఆ భగవంతున్ని ప్రార్థిస్తూన్నాను అని తెలిపారు

# ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చే వరకు బిజెపి పోరాటం ఆగదు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు




**శేరిలింగంపల్లి, మార్చి 23: (న్యూస్ ఇండియా ప్రతినిధి కే. వినోద్ కుమార్)**
అవినీతి,అరాచక ,కమిషన్ల పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా .. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తో అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అరెస్ట్ చేసిన పోలీసులులి

6 గ్యారంటీలు,66 హామీలతో గద్దెనెక్కి,ఇచ్చిన హామీలను మరచి మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను మోసం చేస్తుంది

ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం ఆగదు,రాబోయే రోజుల్లో మరింత గట్టిగా ప్రజల తరపున ఉద్యమిస్తాం...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్

ఈరోజు గడిచిన 2 సంవత్సరాలు గా ప్రజలను మోసగిస్తూ, అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయం పిలుపుమేరకు నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు తో కలిసి అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ మరియు బీజేపీ శ్రేణులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 2 సంవత్సరాలు గా ప్రజలను మోసగిస్తూ, అవినీతి, అరాచక, కమిషన్ల పాలన సాగిస్తుందని, ప్రజల తరపున ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు, 6 గ్యారంటీలు,66 హామీలతో గద్దెనెక్కి, ఇప్పుడు ఇచ్చిన హామీలను మరచి మాయమాటలతో కాలం వెళ్లదీస్తూ ప్రజలను మోసం చేస్తుందని తెలియజేశారు. ఇప్పటికైనా మేలుకొని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల తరపున తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, టాక్ సభ్యులు బుచ్చి రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రావు, శ్రీనివాస్ యాదవ్, భరత్ , పద్మ, మేరీ,విష్ణు దత్, రాజేందర్ రెడ్డి,అమర్ యాదవ్,రాము యాదవ్, సాయి కుమార్ పటేల్ మరియు ఇతర బీజేపీ నాయకులు,కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# షహిద్ భగత్ సింగ్ ఆశయ స్ఫూర్తితో శాంతి కోసం పోరాడుదాం



- యుద్ధం వలన ప్రజలపై భారాలకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం
- భగత్ సింగ్,రాజగురు, సుఖదేవ్ ల వర్ధంతి కార్యక్రమంలో ఏఐఎఫ్ డివై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనం సుధాకర్

**శేరిలింగంపల్లి, మార్చి 23: (న్యూస్ ఇండియా ప్రతినిధి కే. వినోద్ కుమార్)**
షాహిద్ భగత్ సింగ్ రాజగురు సుఖదేవుల 95వ వర్ధంతి కార్యక్రమాన్ని నేడు ఏఐఎఫ్ డివై ఆధ్వర్యంలో మియాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గల తాంద్ర కుమార్ విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. హాజరైన నాయకులు కూడా ముందుగా భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ ల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

డి మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ దశరథ్ నాయక్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి సుల్తానా బేగం రాష్ట్ర కమిటీ సభ్యులు డి శ్రీనివాసులు,కే షరీఫ్, సభ్యులు రంగస్వామి,దేవనూర్ నర్సింహా, ఆకుల రమేష్, ఎస్ కే ఇక్రాన్ డి నర్సింహా,.ఏఐఎఫ్ డిబ్ల్యు నాయకురాలు జి శివాని, లలిత.ఎల్లమ్మ పార్టీ నాయకులు శంకర్ .. తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మార్చి 23 ( మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్)**
జిల్లాలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి. సోమవారం శామీర్ పేట్ మండలంలోని హకీంపేట్ లోని తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షలు జరుగుతున్న తరగతి గదులలో తిరిగి విద్యార్థులు పరీక్ష వ్రాయడాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయా అని జిల్లా విద్యా శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో మొత్తం ఎంత మంది పరీక్ష వ్రాసే విద్యార్థులు ఉన్నారని, అందులో గైరుహాజరు ఎంతమంది అని అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయ కుమారి,శామీర్ పేట్ మండల తహసీల్దారు సుచరిత,తదితరులు పాల్గొన్నారు.

# గోపనపల్లిలో అక్రమ నీటి తరలింపు తీవ్ర తాగునీటి సంక్షోభం, ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు



**శేరిలింగంపల్లి, మార్చి 23: (న్యూస్ ఇండియా ప్రతినిధి కే. వినోద్ కుమార్)**శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని వాణిజ్య అవసరాల కోసం తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ప్రభావంతో భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయి బోర్లు ఎండిపోయాయి. ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం (23-03-2026) గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, సురేందర్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ప్రజావాణికి 163 దరఖాస్తులు





## అధిక సంఖ్యలో హౌసింగ్ డిపార్ట్మెంట్ కు 58 దరఖాస్తులు

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మార్చి 23 ( మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )**
ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ చంద్రావతిలతో కలిసి కలెక్టరు (163) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈరోజు హౌజింగ్ డిపార్టుమెంట్ కు అధిక సంఖ్యలో (58) దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు.అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారికి ఐదవ రోజు వసంత నవరాత్రి మహోత్సవములు

**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో వసంత నవరాత్ర మహోత్సవములు ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఐదవ రోజు కార్యక్రమాలలో (దివి 23-03-2026 సోమవారం) భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట కల్పోక్త ప్రకారం వసంత నవరాత్ర ఉత్సవాల సందర్భంగా జరుపవలసిన విశేష జనహనామార్చనాభిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష కరవీర (గులాబిరంగు గన్నేరు) పూలతో అర్చన జరిపి అమ్మవారికి నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా శ్రీ కుందూరు అనిల్ రెడ్డి- అనిత దంపతులు వ్యవహరించారు



**దేవస్థానమును సందర్శించు భక్తుల దాహార్తి తీర్చుటకు వరంగల్ మార్వాడీ మిత్ర మండలి**

సభ్యులు శ్రీయుతులు అర్జున్, ఉత్తమ్, ముఖేష్, రమేష్, దినేష్, హితేష్, భరత్, వినయ్ కేతారాం, క్రైలేష్, సురేష్లు 50 కూల్ వాటర్ క్యాన్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీతకు ధర్మకర్తలు శ్రీ తౌనుపునూరి వీరన్న, శ్రీ ఓరుగంటి పూర్ణచందర్, శ్రీమతి మయూరి రామేశ్వర్రావు, శ్రీ జారతి వెంకటేశ్వర్లు, శ్రీ అనంతుల శ్రీనివాస్, శ్రీ శ్రీధర్రావుల సమక్షమున అందజేశారు

**భద్రకాళి దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమం ఈరోజు నుండి జరుగుతుంది**

ఈ రోజు దేవాలయ హుండీ లెకింపు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ హుండీ పర్యవేక్షణ ఖమ్మం జిల్లా సహాయ కమీషనర్ శ్రీ ఎం. వీరస్వామి ఆధ్వర్యవమున నిర్వహించబడింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డావ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు శ్రీయుతులు శ్రీ తౌనుపునూరి వీరన్న, శ్రీ ఓరుగంటి పూర్ణచందర్, శ్రీమతి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, శ్రీ బింగి సతీష్, శ్రీ జారతి వెంకటేశ్వర్లు, శ్రీ పాలడుగుల ఆంజనేయులు, శ్రీ అనంతుల శ్రీనివాస్, శ్రీముగా శ్రీనివాసరావు, శ్రీ శ్రీధర్రావు, ఎక్స్ అఫీషియో మెంబర్ శ్రీ పార్నంది నర్సింహమూర్తి మరియు శ్రీ లక్ష్మివెంకటేశ్వర, శ్రీ లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అనే నేను చెబుతున్నా...

# దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్






- స్టీల్ ప్లాంట్‌కు ఫౌండేషన్ కాదు... స్టీల్ సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం
- దేశ ఉక్కు అవసరాలు తీర్చేలా ఏపీ అభివృద్ధి సాధిస్తోంది
- ఉత్తరాంధ్రకు ఊపు తెచ్చే ప్రాజెక్ట్... రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించే ప్రాజెక్ట్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి... 1 లక్షకుపైగా ఉద్యోగాలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- (ఏఎం-ఎన్ఎస్) ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అనకాపల్లి/పాయకరావు పేట, న్యూస్ ఇండియా ప్రతినిధి** అనకాపల్లిలో జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదని... స్టీల్ సిటీ నిర్మాణం కోసమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏపీకి రావడం చాలా మంచి పరిణామమని.. అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు పెట్టడానికి ఈ స్టీల్ ప్లాంట్ ఉపకరిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. చంద్రబాబు నాయుడు అనే నేను చెబుతున్నా... పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్ అంటూ సీఎం ప్రకటించారు. సోమవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన ఘనంగా జరిగింది. కేంద్రమంత్రి హెచ్‌డి కుమార స్వామి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ సంస్థకు చెందిన ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుపస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."20 నెలల్లోనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును శంకుస్థాపన చేసుకున్నాం. ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షమంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రాజెక్టు రావడానికి కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్నా. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. రూ.1.35 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సంస్థకు జాతీయ స్థాయిలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా చాలా మంచి పేరుంది. ఇలాంటి సంస్థ ఏపీకి రావడం చాలా మంచి పరిణామం. అందుకే చెబుతున్నాను... ఇవాళ జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్ కోసం మాత్రమే కాదు... స్టీల్ సిటీకి జరిగిన శంకుస్థాపన. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతుంది. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నేస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు. ఈ ప్లాంట్ కోసం పైప్ లైన్ వేయాలని ప్రధానిని కోరితే వెంటనే అంగీకరించారు. ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### అనుమతులు వేగంగా ఇస్తాం... అదే వేగంతో అభివృద్ధి చేయండి

"ఈ పరిశ్రమకు ఇంత వేగంగా భూసేకరణ, అనుమతులను ఒక్క ఏపీలోనే ఇచ్చాం. చంద్రబాబు అను నేను చెబుతున్నాను... దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం. టూరిజం నుంచి డేటా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి. బీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లోనే రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ మారుతోంది. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం ఇస్తాం. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలి. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు. మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలి. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

### అభివృద్ధి చేస్తామని చెప్పాం... చేసి చూపిస్తున్నాం

"ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఈ ప్రాజెక్టు సాకారమైంది. రాష్ట్రంపై ప్రధాని చూపిస్తున్న అభిమానానికి ఈ వేదిక పైనుంచి మరోసారి కృతజ్ఞతలు చెబుతున్నా. ప్రధాని మోదీ చెప్పిన చిప్ టు షిప్ తయారీ విధానానికి ఏపీ తిరుగులేని వేదిక. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో నేడు ఈ పరిశ్రమ రాష్ట్రానికి వచ్చింది. డబుల్ ఇంజన్ సర్కార్ విజయం ఇది. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేస్తామని... నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలన చేసి చూపిస్తున్నాం. ఏ పని తలపెట్టినా సంపూర్ణ మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నా. మంత్రి లోకేష్ పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు."అని సీఎం చెప్పారు.

### నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఒప్పందం

యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పన, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో రెండు వేర్వేరు ఒప్పందాలను ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్ సంస్థ చేసుకున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్యాలు కల్పించేలా ఒక ఒప్పందం, ఆధునిక ఉత్పత్తి సామర్థ్యాలపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు మరో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యాధునిక మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ద్వారా యువతకు మెరుగైన నైపుణ్యం, తయారీ సామర్థ్యాలను కల్పిస్తామని ఆర్సెలార్ మిట్టల్ -నిప్పన్ స్టీల్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ ప్రకటించారు.

### ఎక్స్ పీరియన్స్ జోన్ సందర్శన

శంకుస్థాపన కార్యక్రమానికి ముందు అదే ప్రాగంణంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ జోన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. సీఎంతోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్స్ పీరియన్స్ జోన్ ను సందర్శించారు. (ఏఎమ్-ఎన్ఎస్ )ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో (ఏఎమ్- ఎన్ఎస్ ) ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై ప్రదర్శించిన వీడియోలను తిలకించారు. దశల వారీగా ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ మీనియేచర్ ను సీఎం, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్సెలార్ మిట్టర్ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఆర్సెలార్ మిట్టల్ సీఈఓ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## పి వై ఎన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్ 95వ వర్ధంతి



**న్యూస్ ఇండియా తెలుగు మార్చి 23 మహబూబాబాద్ జిల్లా బయ్యారం:...**ప్రగతిశీ యువజన సంఘం (పి వై ఎల్ ) ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్ 95వ,వర్ధంతి సందర్భంగా బయ్యారం మండల కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించడం జరిగింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దోపిడి వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా దేశభక్తి భావాలను పెంపొందించుకొని దేశ ప్రజల స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ఆత్మబలిదానాలు చేసుకున్నారని పి వై ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ తుడుం వీరభద్రం అన్నారు.నేడు దేశంలో హిందూ మతం పేరుతో ప్రజలను రెండు వర్గాలుగా విభజించి, వైశ్యమ్యాలను సృష్టించి పదం గడుపుతున్నారని , ప్రశ్నించే గొంతులను తీవ్రనిబంధాన్ని ప్రయోగించి సహజ వనరులను బడా కార్పొరేట్ శక్తులకు చేస్తున్నారని వారు విమర్శించారు. పాలుకలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ భగత్ సింగ్,రాజగురు సుఖ్ దేవ్ కలలుగన్న ఆశయం కోసం జరుగుతున్నటువంటి ఉద్యమాలలో అందరం భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులుకామ్రేడ్స్ ఏపూరి వీరభద్రం, మంగీలాల్ ,బి రెడ్డి సంగన్న ,కేసముందర్, వీరబోయిన ఐలయ్య, సోమవరపు సుధాకర్, శేషు, కామ్రేడ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


## జాటోతు హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు.



**న్యూస్ ఇండియా తెలుగు మార్చి 23. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:...**జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్ ఈ మధ్యకాలంలో మృత్యువాత పడడంతో వారి కుటుంబాన్ని సోమవారం బయ్యారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంకపల్లి సుమన్ రెడ్డి పరామర్శించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయిని ఇంద్రారెడ్డి,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్, నాయకులు ఆడెపు జై,పోలబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## చీకట్లో వల్మీడి శ్రీ సీతారామచంద్రస్వామి గుట్ట ప్రయాణం....

- బ్రహ్మోత్సవాలకు చీకట్లో రామయ్య తండ్రి ప్రయాణం...
- పట్టించుకోని అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది....




**జనగామ జిల్లా పాలకుర్తి మండలం న్యూస్ ఇండియా తెలుగు** వల్మీడి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ రోజు ప్రారంభం అయ్యాయి.గ్రామంలో గుడి నుండి దేవుడు గుట్టపైకి వెళ్లే పలు చోట్ల గ్రామపంచాయతీ అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాట్లు చేయలేదు.కలెక్టర్ జిల్లా స్థాయిలో బ్రహ్మోత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించిన కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.గ్రామ కార్యదర్శికి ఫోన్ చేస్తే స్పందించడం లేదు. స్పందించకపోవడం ఏ కాకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం జరుగుతుంది.

ఈ ఉత్సవాలకు పై అధికారులు ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం.

వెంటనే గ్రామ సెక్రెటరీ మరియు గ్రామ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు మరియు గ్రామ యువత కోరుకుంటున్నారు...

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం

# ఎడిటోరియల్

## యుద్ధాల్లో బలి అవుతున్న బాల్యం

ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం, ఎక్కువగా నష్టపోయేది బాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు. వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండా పోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం, శాంతిని కాపాడటం.ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు అంశాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు 'విదేశీ శత్రువు' అనే బూచిని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని పటిష్టపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అత్యధిక లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైన కారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్ది మందికి, నష్టం కోట్లాది మందికి.

ఆధునిక యుద్ధాల్లో మరణించే వారిలో ఎక్కువ మంది సైనికులు కాదు, సాధారణ ప్రజలు. అందులో పెద్ద భాగం బాలలే. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాల్లో సుమారు 90 శాతం మరణాలు సాధారణ ప్రజలవే. బాలలను కోల్పోతే మనం మన భవిష్యత్తును కోల్పోతున్నాం. ఎవరి లాభంకోసమైనా బాలల రక్తాన్ని ఖర్చు చేయడం మానవత్వానికే మచ్చ. బాలలు యుద్ధాలకు కారణం కాదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. దీని ప్రభావం లక్షలాది కుటుంబాలపై పడింది. నివేదికల ప్రకారం 2022 నుంచి కనీసం 3200 మంది బాలలు చనిపోయారు లేదా గాయపడ్డారు. ఒక్క 2025లోనే 92 మంది బాలలు మరణించగా, 652 మంది గాయపడ్డారు. దేశంలోని మూడింట ఒక వంతు బాలలు మానసిక గాయాలకు గురయ్యారు. పాఠశాలలు ధ్వంసం కావడం, విద్యుత్ సౌకర్యాలపై దాడులు జరగడం వల్ల పిల్లలు చదువు, ఆరోగ్య సేవలు కోల్పోతున్నారు. చాలామంది శరణార్థులుగా మారిపోయారు. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న గాజా యుద్ధం బాలలపై అత్యంత దారుణ ప్రభావం చూపింది. నివేదికల ప్రకారం 21 వేలకు పైగా బాలలు చనిపోయారు. 44 వేలకుపైగా బాలలు గాయపడ్డారు. వారిలో వేలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. 56 వేలకుపైగా బాలలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఆహారం లేక వేలాది బాలలు ఆకలి చావు అంచున ఉన్నారు. ఈ యుద్ధం వేలాది బాలలను అనాథలుగా, భయంతో జీవించేలా చేసింది.

ఫిబ్రవరి 2026 లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కూడా బాలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రారంభ దాడుల్లోనే 180 నుండి 200 మంది బాలలు మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 168 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలు పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. విద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రపంచ సంఘర్షణల్లో బాలలపై ఆరు ప్రధాన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బాలలను చంపడం లేదా గాయపరచడం. బాలలను సైనికులుగా ఉపయోగించడం. పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు. లైంగిక హింస, బాలల అపహరణ. మానవతా సహాయాన్ని నిరాకరించడం. ఇవి అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం అయినప్పటికీ యుద్ధాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది బాలలు యుద్ధ ప్రభావంలో జీవిస్తున్నారు. నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 47.3 కోట్ల బాలలు ఘర్షణాత్మక ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ప్రతి రోజూ సగటున 23 మంది బాలలు బాంబు దాడుల్లో గాయపడుతున్నారు. లేదా చనిపోతున్నారు. పాఠశాలలపై దాడులు గణనీయంగా పెరిగాయి. లక్షలాది బాలలు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. కోట్లాది బాలలు శరణార్థులుగా మారిపోయారు. యుద్ధం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేస్తోంది.

యుద్ధం ఎప్పుడూ సమస్యకు పరిష్కారం కాదు. దేశాలు సంభాషణలు, చర్చలు, డిప్లమసీకి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతర్జాతీయ చట్టాలను బలోపేతం చేయాలి. ఆయుధ వ్యాపారంపై నియంత్రణ ఉండాలి. నాయకుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు కూడా యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం గొంతెత్తాలి. బాలలు యుద్ధాలకు కారణం కాదు. కానీ వారు బాధితులు. అందువల్ల వారిని "బలి"గా కాదు, "శాంతి దూతలు"గా చూడాలి. పాఠశాలలు, బాలల క్లబ్బులు, లైబ్రరీల్లో శాంతి కోసం డ్రాయింగ్ కార్యక్రమాలు, కథలు, నాటికలు, కళా ప్రదర్శనలు నిర్వహించాలి. సోషల్ మీడియాలో శాంతి సందేశాన్ని విస్తరించాలి. యుద్ధాలు ఎప్పుడూ శాంతిని తీసుకురావు. అవి కేవలం మరిన్ని కన్నీళ్లు, మరిన్ని చావులు, మరిన్ని అనాథలను మాత్రమే సృష్టిస్తాయి. బాంబు పడిన ప్రతిసారీ చిన్నారుల కలలు చనిపోతాయి. ప్రతి యుద్ధం ఒక తరం భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాలలు చదువుకోవాలి, ఆడుకోవాలి, కలలు కనాలి. కానీ యుద్ధం వారిని భయం, ఆకలి, నిరాశల మధ్య బతికేలా చేస్తోంది. ప్రపంచం ఇప్పుడు ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. బాలల రక్షణ ముందా? యుద్ధాల రాజకీయ ప్రయోజనాలా? నిర్ణయించుకోవాలి. బాలల భవిష్యత్తు మన చేతుల్లో ఉంది. కాబట్టి యుద్ధాలను వ్యతిరేకించాలి. యుద్ధాలు ఆపాలి. శాంతిని కాపాడాలి. బాలల హక్కులను రక్షించాలి. బాలల రక్షణ అంటే మానవత్వ సంరక్షణ.

# మధ్యాహ్నం నిద్రపోతే శరీరంలో ఏం జరుగుతుంది?



చాలా మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాసేపు అలా కనుకు తీయడం అలవాటు. కొందరు దీన్ని సోమరితనంగా భావిస్తే మరికొందరు అలసటను తగ్గించుకునే మార్గంగా చూస్తారు. అయితే మధ్యాహ్నం నిద్ర అందరికీ ఒకేలా పని చేయదని, అది మనం నిద్రపోయే సమయం, వ్యవధిపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ విశ్లేషణ ప్రకారం.. మధ్యాహ్నం పూట 20 నుండి 30 నిమిషాల పాటు తీసుకునే చిన్న నిద్ర మెదడుకు ఎంతో విశ్రాంతినిస్తుంది. చిన్న విశ్రాంతి వల్ల పని సామర్థ్యం, ఏకాగ్రత మెరుగుపడతాయి. రాత్రి నిద్ర సరిగ్గా లేని వారికి లేదా శారీరక శ్రమ అధికంగా చేసే వారికి ఈ చిన్న నిద్ర రీఛార్జ్‌లా పనిచేస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచి, మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడిపేలా చేస్తుంది. గంట దాటితే ముప్పే: మధ్యాహ్నం నిద్ర ప్రయోజనకరమే అయినప్పటికీ అది గంట దాటితే మాత్రం అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గంట కంటే ఎక్కువ నిద్రపోతే లేచిన తర్వాత తలనొప్పి, బద్ధకం, శరీరం బరువుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి. మధ్యాహ్నం ఎక్కువసేపు నిద్రపోతే రాత్రిపూట నిద్ర పట్టడం కష్టమవుతుంది. ఇది మీ జీవక్రియను దెబ్బతీస్తుంది. ఇది అలవాటుగా మారితే శారీరక శ్రమ తగ్గి, క్రమంగా సోమరితనం పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే రాత్రిపూట నాణ్యమైన నిద్ర అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, మేల్కొనడం అలవాటు చేసుకోవాలి. పడుకునే ముందు మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలి. రాత్రిపూట తక్కువగా, తేలికగా ఉండే ఆహారం తీసుకోవాలి. కెఫీన్ వాడకం తగ్గించాలి. పడకగది ప్రశాంతంగా, వెలుతురు లేకుండా చూసుకోవాలి. మధ్యాహ్నం నిద్రపోవాలి అనుకుంటే కేవలం 20-40 నిమిషాలకే పరిమితం అవ్వండి. అది మీ శరీర అవసరాలకు అనుగుణంగా ఉండాలి తప్ప, నిద్రనే ఒక వ్యసనంగా మార్చుకోకూడదని గుర్తుంచుకోండి.

# సిగరెట్ తాగుతున్నారా? పిల్లలకు ఆ వ్యాధి వస్తుందంట..



ధూమపానం ఒక ప్రమాదకరమైన అలవాటు.. చాలా మందికి ధూమపానం వ్యసనం ఉంటుంది. ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా.. సిగరెట్ (పొగాకు) కాల్చాల్సిందే.. ఇది ప్రమాదకరమని తెలిసినా.. పలు జబ్బుల బారిన పడేస్తుందని హెచ్చరించినా కూడా మానరు.. అయితే.. పొగాకు తాగడం వల్ల ఆ వ్యక్తే కాకుండా.. పక్కన ఉన్న వారికి కూడా ప్రమాదకరమని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు. ధూమపానం ఒక ప్రమాదకరమైన అలవాటు.. చాలా మందికి ధూమపానం వ్యసనం ఉంటుంది. ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా.. సిగరెట్ (పొగాకు) కాల్చాల్సిందే.. ఇది ప్రమాదకరమని తెలిసినా.. పలు జబ్బుల బారిన పడేస్తుందని హెచ్చరించినా కూడా మానరు.. అయితే.. పొగాకు తాగడం వల్ల ఆ వ్యక్తే కాకుండా.. పక్కన ఉన్న వారికి కూడా ప్రమాదకరమని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. అయితే.. తాజా అధ్యయనంలో మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది.. తండ్రి పొగాకు వాడటం వల్ల.. పిల్లల్లో డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని తాజాగా.. ఓ అధ్యయనం హెచ్చరించింది. ఒక తండ్రి పొగాకు వాడకం అతని పిల్లలు చక్కెరను ఎలా ప్రాసెస్ చేస్తారనే దానిపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల వారికి డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని కొత్త పరిశోధన వెల్లడించింది. జర్నల్ ఆఫ్ ది ఎండోక్రైన్ సొసైటీలో ప్రచురితమైన ఒక అధ్యయనంలో మగ ఎలుకలలో నికోటిన్ బహిర్గతం వాటి సంతానంలో జీవక్రియ మార్పులకు దారితీసిందని కనుగొంది. డయాబెటిస్ ఒక ప్రధాన ఆరోగ్య సమస్య. అమెరికాలో, 40 మిలియన్లకు పైగా ప్రజలు ఈ పరిస్థితితో జీవిస్తున్నారని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. డయాబెటిస్ గుండె జబ్బులు, మూత్రపిండాల నష్టం, నరాల నష్టం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఇది చాలా మందిని ప్రభావితం చేసే జీవితకాల పరిస్థితి కాబట్టి, దీనిని నిర్వహించడం వల్ల గణనీయమైన ఆర్థిక ఖర్చులు తలెత్తుతాయి.

ధూమపానం.. ఎలక్ట్రానిక్ సిగరెట్ల వాడకం అనారోగ్యానికి అత్యంత నివారించగల కారణాలలో ఒకటి అని అధ్యయనం చూపిస్తుంది. ముఖ్యంగా మహిళల కంటే పొగాకు ఎక్కువగా ఉపయోగించే పురుషులలో ఈ అలవాట్లను తగ్గించడం మధుమేహం పెరుగుదలను నెమ్మదింపజేయడంలో లేదా నియంత్రించడంలో సహాయపడుతుంది. డాక్టర్ రాక్వెల్ చమోరో-గార్సియా.. శాంటా క్రూజ్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని అధ్యయనం సీనియర్ రచయిత ఇలా వివరించారు: "మగ ఎలుకలు తమ తాగునీటిలో నికోటిన్‌ను తీసుకున్నప్పుడు, వాటి సంతానంలో జీవక్రియ మార్పులు సంభవించాయి, ఇవి శరీరం చక్కెరను జీవక్రియ చేసే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. పురుషులలో పొగాకు వాడకం వారి వారసులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ఇది సూచిస్తుంది." అని చెప్పారు. ఈ ప్రయోగంలో, పరిశోధకులు నికోటిన్‌కు గురైన మగ ఎలుకల సంతానాన్ని, దానికి గురికాని తండ్రుల సంతానంతో పోల్చారు. నికోటిన్‌కు గురైన తండ్రుల ఆడ సంతానంలో ఇన్సులిన్, ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉండగా, మగ సంతానంలో రక్తంలో చక్కెర, కాలేయ పనితీరులో కూడా మార్పులు కనిపించాయి. ఈ మార్పులు ఊబకాయం, జీవక్రియ కాలేయ వ్యాధి వంటి పరిస్థితులకు సంబంధించినవి. తండ్రులు పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల వారి పిల్లల ఆరోగ్యంపై శాశ్వత ప్రభావాలు ఉంటాయని.. ఈ పరిశోధనలో కనుగొన్న విషయాలు చెబుతున్నాయని డాక్టర్ చమోరో-గార్సియా పంచుకున్నారు. గర్భధారణకు ముందు పురుషుల ఆరోగ్యం ప్రాముఖ్యతను ఇది నొక్కి చెబుతుంది.


# మామిడికాయ ఇంత పనిచేస్తుందా



వేసవి వచ్చిందంటే చాలు.. మార్కెట్లో పచ్చి మామిడి పండ్ల సందడి మొదలవుతుంది. పుల్లపుల్లగా, కారం కారంగా నోరూరించే పచ్చి మామిడి కేవలం రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఒక వరప్రసాదం అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వడదెబ్బ నుంచి రక్షణ: ఎండ తీవ్రత వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది. పచ్చి మామిడి రసం తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. ఇది వడదెబ్బ ప్రమాదాన్ని సమర్థవంతంగా తగ్గిస్తుంది.జీర్ణక్రియకు మేలు: మీకు తరచుగా మలబద్ధకం, గ్యాస్ లేదా ఎసిడిటీ వంటి సమస్యలు వేధిస్తున్నాయా? అయితే పచ్చి మామిడి మీకు మంచి మందులా పనిచేస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది కాలేయం నుండి పిత్త స్రావాన్ని పెంచి,

ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపు: పచ్చి మామిడిలో విటమిన్ సి నిల్వలు ఎక్కువగా ఉంటాయి. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి, కాలానుగుణంగా వచ్చే ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడుతుంది. అలాగే ఇందులోని విటమిన్ ఎ కంటి చూపుకు, చర్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.బరువు తగ్గాలనుకునే వారికి వరం: పండిన మామిడి పండ్లతో పోలిస్తే పచ్చి మామిడిలో చక్కెర మరియు కేలరీలు చాలా తక్కువ. ఇది శరీర మెటబాలిజంను పెంచి కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా పచ్చి మామిడి ముక్కలను నమలడం వల్ల చిగుళ్ల నుండి రక్తం కారడం, నో టి దుర్వాసన వంటి సమస్యలు తగ్గుతాయి. పచ్చి మామిడి ఆరోగ్యానికి మంచిదే అయినా, అతిగా తింటే మాత్రం గొంతు నొప్పి లేదా కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తినేటప్పుడు కొద్దిగా ఉప్పు లేదా బెల్లం కలిపి తీసుకోవడం వల్ల ఆమ్ల ప్రభావాన్ని తగ్గించవచ్చు.

# ఉల్లిగడ్డ పొట్టులో ఉన్న లాభాలు..!



ఉల్లిపాయ పొట్టుతో ఎన్నో లాభాలున్నాయి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. ప్రతిరోజూ వంటగదిలో చాలా కూరగాయలు, పండ్ల తొక్కలు, ఇతర వ్యర్థాలు జమ అవుతాయి. చాలామంది వాటిని పనికిరావని భావించి చెత్తబుట్టలో వేస్తారు. కానీ, నిజానికి వాటిలో కూడా అనేక ప్రయోజనాలు దాగి ఉంటాయి. అలాంటివాటిలో ఉల్లిపాయ పొట్టు కూడా ఒకటి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. 1. సహజ ఎరువుగా.. ఉల్లిపాయ తొక్కలను సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇవి మొక్కల పెరుగుదలకు సహాయపడతాయి. తొక్కలను నీటిలో నానబెట్టి ఆ నీటిని మొక్కలకు పోస్తే ఆకులు పచ్చగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. 2. జుట్టు సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలు జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తాయి. ఒక గిన్నెలో నీరు తీసుకుని ఉల్లిపాయ తొక్కలను వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత ఆ నీటిని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు మెరిసేలా, బలంగా, మందంగా మారుతుంది. 3. టీగా.. కొంతమందికి మాత్రమే తెలిసిన విషయం ఏమిటంటే.. ఉల్లిపాయ తొక్కలతో టీ కూడా తయారు చేయవచ్చు. ఈ టీ తాగడం వల్ల ఊబకాయం తగ్గడంలో సహాయపడుతుంది. అలాగే అలెర్జీలు, ఇన్ఫెక్షన్లు, అధిక రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. 4. చర్మ సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. తొక్కలను నీటిలో మరిగించి, చల్లారిన తర్వాత ఆ నీటిని చర్మానికి అప్లై చేస్తే చర్మం తాజాగా కనిపిస్తుంది. ఉల్లిపాయ తొక్కలను ఇంటి శుభ్రపరచడంలో కూడా ఉపయోగించవచ్చు. తొక్కలను నీటిలో మరిగించి ఆ నీటితో వంటగదిని లేదా ఇంటిని శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోతాయి. దీనిని ప్రతిరోజూ కూడా ఉపయోగించవచ్చు.



**ఫోటోషూట్ లో అషు రెడ్డి స్టన్స్**

# రెండు సర్దార్ లను మించి మూడో సర్దార్ !



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ కెరీర్‌లో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో -సర్దార్- ఒకటి. గూఢచారి నేపథ్యంలో సాగే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించడమే కాక కార్తీ నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించిన చిత్రమది.

ప్రస్తుతం ఈ సినిమాకు కొనసాగింపుగా -సర్దార్ 2- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. మిత్రన్ దర్శకత్వం వహిస్తోన్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే సినిమా రిలీజ్ కావాలి. కానీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా విడుదల ఆలస్యమవుతుంది. ప్రస్తుతం కార్తీ హీరోగా తాజా చిత్రం -మార్షల్- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే.

తాజాగా ఈ సినిమా వివరాలు లీక్ అవుతున్నాయి. -మార్షల్- కూడా స్పై చిత్రమేనని అంటున్నారు. -సర్దార్- రెండు భాగాలను మించి మార్షల్ ఉండబోతోందని సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఈ సినిమా కాన్సెప్ట్ విన్నవారంతా? ఇది 'సర్దార్ ను మించిన ట్విస్ట్ లో కథ లో ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. -మార్షల్- గూఢచారి నేపథ్యంలోనే సాగుతున్నప్పటికీ? ఇందులో యాక్షన్ లెవెల్స్ మిషన్ తీవ్రత సన్నివేశాలు స్ట్రాంగ్ గా ఉంటాయం టున్నారు. -సర్దార్- లో కార్తీ తండ్రి, కొడుకుగా రెండు భిన్నమైన పాత్రల్లో అలరించారు. కానీ -మార్షల్- లో ఆయన పోషించే పాత్రలు అంతకు మించిన డెప్త్ కలిగి ఉంటాయని లీకులందుతున్నాయి.

ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో సాగే పోరాట సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని అంటున్నారు. స్పై కాన్సెప్ట్ అంటే కొత్తగా ఏమీ ఉండదు. శత్రు దేశంపై మిషన్స్ నేపథ్యంలోనే సాగుతుంటాయి. అయితే ట్రీట్ మెంట్ అన్నది ముఖ్యం. ఈ సినిమా కాన్సెప్ట్ ప్రధానంగా దేశ రక్షణ కోసం సరిహద్దులు దాటి వెళ్లే ఒక రహస్య సైనికుడి ప్రయాణం చుట్టూ తిరుగుతుందిట. ఇందులో టెక్నాలజీ , ఇంటెలిజెన్స్ అంశాలను దర్శకుడు నలన్ కుమార స్వామి చాలా కొత్తగా ప్రజెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

సర్దార్ లో కేవలం వాటర్ మాఫియా గురించి చెబితే? మార్షల్ లో అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఒక భారీ కుట్రను ఛేదించే హీరోగా కార్తీ కనిపిస్తారని సమాచారం. ఈ క్రమంలో వచ్చే ట్విస్ట్‌లు ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెడతాయని యూనిట్ వర్గాలు చర్చించుకుంటున్నాయి.


ఈ సినిమా కోసం కార్తీ కూడా నాలుగింతలు ఎక్కువ శ్రమ పడుతున్నాడుట. -సర్దార్- ను మించిన మేకోవర్ కార్తీ రోల్ లో హైలైట్ అవుతుందంటున్నారు. భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం విదేశీ స్టంట్ మాస్టర్ల పర్యవేక్షణలో కార్తీ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడుట. సంతోష్ నారాయణన్ సంగీతం ఈ స్పై థ్రిల్లర్‌కు ప్రధాన బలంగా నిలిచే అవకాశం ఉంది. మొత్తంగా కాన్సెప్ట్ పరంగా , మేకింగ్ పరంగా కార్తీ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోతుందని ట్రేడ్ విశ్లేష కులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.



**శ్రీదేవి పూల సొగసు లో గ్రేస్‌ని వెదజల్లు తుంది**

# 'వారణాసి'లో లెజెండరీ క్రికెటర్ వైఫా?

సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య -వారణాసి- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో మహేష్ ద్విపాత్రాభినయం చేస్తుండగా, హీరోయిన్ గా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో నటిస్తోంది. మలయాళ నటుడ పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ గా కుంభ పాత్ర పోషిస్తున్నాడు. విలోణ నటుడు ప్రకాష్ రాజ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇదంతా నటీనటులకు సంబంధించి ఉన్న అధికారిక సమాచారం. అయితే తెరపైకి రాని పాత్రలు ఇంకా చాలానే ఉన్నాయి. అందులో కొన్ని కీలకమైన పాత్రలు కూడా ఉన్నాయి.



రాజమౌళి సినిమా అంటే క్యాస్టింగ్ కూడా భారీగానే ఉంటుంది. ఆయన సినిమాలో చిన్న చిన్న పాత్రలు కూడా హైలైట్ అవుతుంటాయి. కీలక పాత్రలైతే? వారి దశే మారిపోయేలా పాత్రలుంటాయి. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. తాజాగా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ నటి, లెజెండరీ క్రికెటర్ విరాట్ కోహ్లీ సతీమణి అనుష్క శర్మ పేరును రాజమౌళి పరిశీలిస్తున్నట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. ఇప్పటికే ఈ విషయంలో ఆమెతో ప్రాథమిక చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. -వారణాసి- ఒక గ్లోబల్ అడ్వెంచర్ చిత్రం కావడంతో కథలో భాగంగా కొన్ని కీలక సన్నివేశాలకు అనుష్క శర్మ వంటి అనుభవం ఉన్న నటి అయితే బాగుంటుందని జక్కన్న భావిస్తున్నారుట. అనుష్క శర్మ పాత్ర కథను మలుపు తిప్పే మిస్టీరియస్ క్యారెక్టర్ అని సమాచారం. ఒకవేళ ఇది నిజమైతే అనుష్క శర్మ అంగీకరిస్తే గనుక ప్రొఫెషనల్ గా ఆమె కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకున్నట్లే. విరాట్ ను వివాహమాడిన తర్వాత అనుష్క చాలా సెలక్టివ్ గా సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. నటిగా కంటే నిర్మాతగానే బిజీ అయ్యారు. -పీకే- లాంటి సినిమాతో పాన్ ఇండియాలోనూ ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు దక్కింది.

గతంలో రాజమౌళి -బాహుబలి- ని ప్రశంసించిన వారిలో అనుష్క కూడా ఉంది. రాజమౌళి మేకింగ్‌ను ఎంతో లైక్ చేసింది. రాజమౌళి సినిమాల్లో అతిథి పాత్రలు కూడా సినిమా రేంజ్‌ను పెంచుతాయి. వారణాసి నేపథ్యంలో సాగే కొన్ని కీలక సన్నివేశాల్లో అనుష్క శర్మ కనిపించే అవకాశం ఉంది. అనుష్క శర్మ అంగీకరిస్తే? వారణాసికి గ్లోబల్ స్థాయిలో మార్కెట్ పరంగానూ కలిసొస్తుంది. భర్త విరాట్ ఇంటర్నేషనల్ క్రికెటర్ గా ఎంతో మంచి పేరుంది. అలాంటి ప్లేయర్ సతీమణి -వారణాసి-లో భాగమైందంటే? 120 దేశాల్లో ఆ సినిమాకు ప్రత్యేకమైన ఐడెంటిటీ దక్కుతుంది. రాజమౌళి ఛాయిస్ వెనుక ఈ స్ట్రాటజీ కూడా లేకపోయి ఉండదు.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com